విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 19, నవంబర్ 2023

రైతులు ఆరుతడి పంటలే సాగు చేసుకోండి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : రైతులు రబీ సీజన్లో వరి పంటను ఎట్టి పరిస్థితుల్లోనూ వేసు కోవద్దని, వరిస్థానంలో ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని ఏవో కిషోర్‌కుమార్ రెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని మిట్ట పల్లి, అహోబిలం, బాచేపల్లి గ్రామాలలో శనివారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా రబీపంటకు తెలుగుగంగ, కేసీకి నీరు విడుదల చేయడం జరగదన్నారు. ఈ విషయం గమనించి రైతులు ఆరుతడి పంటలను మాత్రమే సాగు చేసుకోవాలని ఏవో సూచించారు. ఈ సదస్సులో వ్యవసాయ విస్తరణ అధికారి, గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : డిసెంబర్ 9న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను ఖచ్చిదారులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జి తేజసాయిలు సంయుక్తంగా తెలిపారు శనివారం కోర్టు ఆవరణంలో న్యాయవాదులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో రాజీపడే క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, భూ తగాదాలు, కుటుంబ తగాదాలు, చెక్ బౌన్స్ కేసులు పరిష్కరిస్తామన్నారు. ఈసమావేశంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు కేశవరెడ్డి, అసిస్టెంట్ గవర్నమెంట్ న్యాయవాది సుధాకర్ రెడ్డి, న్యాయవాదులు గిరిరాజు, వెంకటేశ్వర్లు, బలరాం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : పట్టణ శివారుల్లోని పడకండ్లకు సమీపంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలను విద్యాశాఖ అధికారుల బృందం శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చాగలమర్రి ఎంఈఓ లు న్యామతుల్లా, అనురాధ తనిఖీ నిర్వహించి పాఠశాలకు సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేశారు. ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు అందవలసిన సౌకర్యాలను వారు పరిశీలించారు. ఎంఈఓ న్యాయతుల్లా మాట్లాడుతూ మండలంలోని పది పాఠశాలలను ఇప్పటికే తనిఖీ చేసినట్లు తెలిపారు. తనిఖీ రికార్డుల నివేదికలను ఉన్నతాధికారులకు పంపడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షేక్ ఫిర్దోస్ అంజుమ్ ఉన్నారు.

రాష్ట్రాభివృద్ధి సాధించాలంటే టీడీపీకే సాధ్యం

విశాలాంధ్ర-బనగానపల్లె : రాష్ట్రాభివృద్ధి సాధించాలంటే అది తెలుగుదేశం పార్టీతో సాధ్యమని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని అప్పులాపురం, వితలాపురం గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ అనే కార్యక్రమని జనసేన - టీడీపీల ఆధ్వర్యంలో నిర్వహించారు. అప్పులాపురం చేరుకోగానే బీసీ జనార్ధన్‌రెడ్డికి నాయకులు కార్యకర్తలు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి పూలమాలలతో సన్మానించారు. గ్రామంలోని ప్రజావేదిక వద్ద టీడీపీ మినీ మేనిఫెస్టో సూపర్ సిక్స గురించి ఇంటింటికి వెళ్లి వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. 2024 ఎన్నికల్లో బనగానపల్లి నియోజకవర్గంలో రాష్ట్రంలో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఇంచార్జ్ భాస్కర్, పిపి మురలీమోహన్ రెడ్డి, గ్రామ ప్రజలు, టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అధికార వైసీపీకి భారీ షాక్

విశాలాంధ్ర-ఆత్మకూరు రూరల్ : వైసీపీని వీడి మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో ఆత్మకూరు మండల యూత్ వింగ్ అధ్యక్షుడు దినకర్‌రావుతో పాటు మరో 150 కుటుంబాలు శనివారం తెలుగుదేశం పార్టీలో చేరాయి. బుడ్డా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ చేరిన వాళ్ళు దినకర్, సంపత్, ప్రదీప్, రాంబాబు, ప్రణీత్, భగత్, భరత్, అశోక్, నగేష్, ముక్కు రమణ, కురువ కిట్టు, కురివ శివ, కరువేన శేషులు, రంజిత్, లక్షణ రావు, జయపల్ రావు, ఎస్.రాజు,సత్యరాజు, గద్దల విజయ్ తదితరుల పాటు 150 కుటుంబాలు తెలుగుదేశం పార్టీ లో చేరారు.

రాష్ట్రాభివృద్ధి బాబుతోనే సాధ్యం

విశాలాంధ్ర-నందికొట్కూరు: రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్రఅధికార ప్రతినిధి షకీల్ అహ్మద్, జనసేన తాలూకా అధ్యక్షులు రవికుమార్, మాజీ న్యాయవాది టీడీపీ సీనియర్ నాయకులు నాగముని అన్నారు. శనివారం నందికొట్కూరు పట్టణం లోని స్థానిక కొత్త బస్టాండ్ సమీ పంలో ప్రస్తుత వైసీపీ ప్రభుత్వంలో రోడ్లగుంతల దుస్థితిపై టీడీపీ- జనసేన సంయుక్తంగాకార్యకర్తతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గంలో ఎక్కడ చూసినా ఏ గ్రామానికి వెళ్ళిన రహదారులు గుంతలతో దర్శనమిస్తున్నాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో నియోజక వర్గంలో నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జ్ మాండ్ర శివానందరెడ్డి, గౌరు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో గ్రామాలలో సీసీ రోడ్లు, ఎల్ఈడి వీధి లైట్లు, ప్రయాణికులు గ్రామాలకు వెళ్లేందుకు వేసిన రోడ్లు తప్ప ఇప్పటివరకు ఈ వైసీపీ ప్రభుత్వంలో ఒకకొత్త రోడ్డు వేసిన పాపన పోలేద న్నారు. రాష్ట్రంలో అభివృద్ధి అంతా నేనే చేశానని జగన్మోహన్ రెడ్డి గొప్పలు చెప్పుకోవడం తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. గతంలో మద్యపానం నిషేధం అని మహిళలకు చెప్పి నేడు ఒక క్వాటరు 200 అమ్ముకోవడం జరుగు తుందని, ఎస్సీ ,ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పూర్తిగా లేకుండా చేసిన ఘనత వైసీపీదే అన్నారు. ఇదేనా సంక్షేమమని ప్రశ్నించారు. సంక్షేమం అంటే చంద్రబాబు నాయుడును చూసి నేర్చుకోవాలన్నారు. రాష్ట్రం విడిపోయి లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడం జరిగిందన్నారు. అయితే జగన్మోహన్‌రెడ్డి ఒక్కసారి అవకాశం ఇవ్వండని గెలిచిన తర్వాత రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టి మోసం చేశరన్నారు.

అసలు నీకు ముఖ్యమంత్రిగా పరిపాలించే హక్కు లేదని త్వరలో నీకు నీ వైసీపీ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జైసూర్య, మహేశ్వర్ రెడ్డి, జాకీర్, మూర్తుజావలి, మల్లికార్జున్ రెడ్డి, రాజన్న, ఏసేపు, ప్రవీణ్, నాగరాజు, వాసురెడ్డి, కళాకార్, తదితరులు పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన మాజీమంత్రి అఖిలప్రియ

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ : తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను శనివారం మాజీ మంత్రి భూమా అఖిలప్రియ హైదరాబాదులో ఆయన నివాసంలో కలిశారు. నియోజకవర్గంలో టీడీపీ ఆధ్వర్యంలో చేపట్టిన బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాలకు సంబంధించిన అంశాలు లోకేష్‌కు మాజీ మంత్రి వివరించారు. ఈ సందర్భంగా వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు ఎండగట్టాలని టీడీపీ- జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజల్లోకి తీసుకెళ్లాలని లోకేష్ సూచించినట్టు సమాచారం. ఇదిలా ఉండగా అఖిలప్రియకు ఆళ్లగడ్డ టీడీపీ టికెట్‌ను లోకేష్ ఖరారు చేసినట్టుగా ఆళ్లగడ్డ సోషల్ మీడియాలో వార్త హల్చల్ చేస్తుంది. ఇది నిజమా కాదా అన్నది తెలియాల్సి ఉంది.

సాధికారిక బస్సు యాత్రకు తరలిరండి -ఎమ్మెల్యే

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: మండల కేంద్రమైన కోయిలకుంట్ల వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణంలోని రైతు విశ్రాంతిభవనంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో సామాజిక సాధికారిక బస్సు యాత్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ ఈ నెల 22న సామాజిక సాధికారిత బస్సుయాత్ర బనగానపల్లెలో భారీ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సభను దిగ్విజయం చేయాలనిమండల వైసీపీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈసమావేశంలో వైసీపీ నాయకులు కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ బీవీ నాగార్జునరెడ్డి, కోవెలకుంట్ల ఉపసర్పంచ్ సూర్యనారాయణరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

విశాలాంధ్ర-బేతంచెర్ల రూరల్ : రహదారి భద్రతా అవగాహన సదస్సు లో భాగంగా శనివారం స్థానిక మండల కేంద్రంమైన బేతంచెర్లలోని పాణ్యం జూనియర్ కళాశాలలో విద్యార్థులకు డోన్ మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ ప్రియతమ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యంగా యువత, విద్యార్థులు వాహనాలపై వెళ్లే సమయంలో సమయస్ఫూర్తితో రహదారి నియమావళిని ఉల్లఘించకుండా నడపాలని తెలిపారు. మోటార్ బైక్‌పై వెళ్లే సమయంలో ట్రిపుల్ రైడింగ్, ర్యాస్ డ్రైవింగ్‌తో వెళ్లే సమయంలో ప్రమాదాలు సంభవించి మృతిచెందితే కాళ్ళు, చేతులు విరిగి మంచాన పడ్డ మిమ్మల్ని నమ్ముకున్న తల్లిదండ్రులు అనాదిగా మారి పుత్ర శోకాన్ని అనుభవించాల్సి వస్తోందని కూలంకషంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ.శివశంకర్ నాయక్,కళాశాల ప్రిన్సిపల్ పి.బాలకృష్ణ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

కబడ్డీ శిక్షణ శిబిరాన్ని సందర్శించిన ఎంఈవో

విశాలాంధ్ర -పగిడ్యాల : మండల కేంద్రమైన పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అండర్ 17, బాలుర కబడ్డీ జట్టు శిబిరాన్ని శనివారం నందికొట్కూరు విద్యాశాఖాధికారిణి ఫైజునిసాబేగం సందర్శించారు. ఈ సందర్భంగా కబడ్డీజట్టు సభ్యులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు అందించే సౌకర్యాలు గురించి తెలుసుకుని ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రావు మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ తీసుకున్న క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో విజయం సాధిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

కుష్టుపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర-రుద్రవరం : నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని నరసాపురం గ్రామంలోని జడ్‌పి ఉన్నత పాఠశాలలో కుష్టివ్యాధిపై విద్యార్థులకు వైద్యాధికారి బాబు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కుష్టువ్యాధి కేసులు 2027 నాటికి జీరోకొచ్చే లక్ష్యంతో ఈనెల నుండే కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా నరసాపురం గ్రామంలోని జిల్లా పరిషత్తు పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ వ్యాధిని నివారించే సూచనలు సలహాలు తెలియజేస్తున్నామన్నారు. శరీరంపై స్పర్శలేని, చర్మంపై రాగిరంగు మచ్చలు,పొడలు, లావుగా మారి నొప్పితో కూడిననరాలు, కాళ్లు లేదా చేతుల కండరాలలో బలహీనత, చేతులు పాదాలు నిర్మిర్లుగా అనిపించడం, నొప్పిగా అనిపించి చేతులలో పాదాలలో పుండ్లు ఉండటం, కళ్ళు పూర్తిగా మూసుకోలేకపోవడం, చెవి రెమ్మలు మందంగా మారిపోవడం, చర్మంపై అలాగే చెవి రెమ్మలపై బుడిపెలు ఉండుటం ఉండటం జరుగుతుందన్నారు. చర్మంపై ఈ లక్షణాలు ఏమైనా ఉన్నచో ఆశా కార్యకర్తలు ఆరోగ్య కార్యకర్తలను వెంటనే సంప్రదించి వారి సూచనల మేరకు వైద్యాధికారులతో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.

మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభల దృశ్యమాలిక

నాపరాతి యజమానులకు ప్రభుత్వం అండ

భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



విశాలాంధ్ర-బనగానపల్లె: బనగానపల్లెలో భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్ర ఆధ్వర్యంలో నాపరాయి మైనింగ్ పరిశ్రమలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నాపరాయి యజమానులు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా నాపరాయి యజమాని గుండం శేశిరెడ్డి పలు సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ చింతపండు, నాపరాయి పరిశ్రమలపై జీఎస్టీ తగ్గించడంలో ఆర్థిక మంత్రి బుగ్గన కృషి చాలా ఉందన్నారు. డెడ్ రెంటు 10 రెట్లు పెట్టారన్న మైనింగ్ యజమానుల వినతిని పరిగణలోకి తీసుకున్నాం డెడ్ రెంటు'పై 5 శాతం తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. సీఎఫ్ఈ,సీఎఫ్ఓ విషయంలో మూడేళ్ల గడువును ఐదేళ్లలోపు కట్టుకునేలా పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంటామన్నారు. క్వారీడెడ్ రెంటు కాల వ్యవధిపై అధ్యయనం చేసి సానుకూల నిర్ణయం తీసుకుంటామని ఎండీఎల్ గ్రానైట్ ఫ్యాక్టరీల విధంగానే నాపరాయి పరిశ్రమలకు యూనిట్ కు రూ.2 కరెంట్ ఛార్జీల తగ్గింపు ప్రకటన చేశారు. నాపరాయి మీద ఆధారపడి బ్రతికే వారికి యజమానులకు కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. మేనిఫెస్టోలో పేర్కొన్నట్టు 99.5 అమలు చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వం పేర్కొన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ ఛైర్మన్ పాపిరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, నంద్యాల జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సామూన్, కాటసాని తిరుపాలరెడ్డి, కాటసాని ఓబుల్ రెడ్డి,వైసీపీ రాష్ట్రకార్యదర్శి గుండం శేశిరెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, నాపరాతి యజమానులు, కార్మికులు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామి ఆదాయం రూ. 10.09 లక్షలు

విశాలాంధ్ర-బేతంచెర్ల : ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన శ్రీమద్దిలేటిస్వామి క్షేత్రం శనివారం అధికసంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. వేకువజామున స్వామి, అమ్మవారికి ఆలయ వేదపండితులు, ముఖ్య అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు వేకువజామున అభిషే కాలు, గండా దీపాలు, పుట్టు వెంట్రుకలు మొ క్కులు చెల్లించుకున్నారు. రూముల బాడుగలు, సేవా టికెట్లు,లడ్డు ప్రసాదాలు, లీజుల వసూళు మొదలగు వాటి ద్వారా రూ.10.09 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో డి.పాండు రంగారెడ్డి ఆలయ చైర్మెన్ బి.సీతా రామ చంద్రుడులు తెలిపారు. కర్నూలు పట్టణానికి చెందిన గుర్రం చిన్న మద్దిలేటి భార్య లక్ష్మీ దేవమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు దేవస్థానానికి వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యం కోసం రూ.2.70 లక్షల విలువగల సుమారు 2.కి.మీ మేర పైప్‌లైన్ ఏర్పాటుకు విరాళం అందజేశారు. అలాగే డోన్ మండలం కన్నపకుంటకు చెందిన జయపాల్‌రెడ్డి-లక్ష్మీదేవి దంపతులు ఆలయాభివృద్ధికి రూ.1,00,116 ల నగదును విరాళంగా అందజేశారు. విరాళాలు అందజేసిన దాతలకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ప్రత్యేక పూజ నిర్వహించి,తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రాష్ట్ర మహాసభల్లో ఆకట్టుకున్న ప్రజానాట్యమండలి

విశాలాంధ్ర - నంద్యాల: మహిళా సమాఖ్య 15వ రాష్ట్ర మహాసభల సందర్భంగా ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ప్రజానాట్యమండలి నాయకులు పెంచలయ్య, నంద్యాల, కర్నూలు జిల్లా కార్యదర్శి శివయ్య, నాగరాజులు విప్లవ గీతాలను ఆలపించారు. అలాగే చిన్నారులు చేసిన నృత్యాలు మహిళలను అలరించాయి.

జీవో నెంబర్ 52 తొలగించాలి



విశాలాంధ్ర -బనగానపల్లె : జీవో నెంబర్ 52 తొలగించాలని నంద్యాల జిల్లా గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కాలింగిరి రాముడు పేర్కొన్నారు. ఈనెల 19న ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఏపీ స్టేట్ కమిషనర్ డీవీజీ శంకర్రావు నంద్యాలకు వస్తున్న సందర్భంగా 52 జీవో రద్దుకు మెమరాండం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కులవృత్తులు నమ్ముకొని జీవిస్తున్న గిరిజన ఎరుకలు లంబాడీలు అడవి గిరిజనుల బిడ్డలు ఆదుకోవడంలో నాలుగున్నర సంవత్సరంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. జీఓ నెంబర్ 52 నిజమైన ఎస్టిలకు చాలా అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

గ్రామాల అభివృద్ధికే నిధుల మంజూరు-ఎమ్మెల్యే గంగుల

విశాలాంధ్ర-చాగలమర్రి: ముఖ్యమంత్రి జగనన్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద నిధులను విరివిగా మంజూరు చేస్తున్నారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రరెడ్డి తెలిపారు. శనివారం చాగలమర్రిలోని మండల పరిషత్ కార్యాలయంలో గొడిగినూరు, చిన్నవంగలి, మల్లెవేముల గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తికావడంతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఎమ్మెల్యే గంగుల నాని అధికారులు, ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి అయిన ప్రతి గ్రామ సచివాలయ పరిధిలోని గ్రామాలాభివృద్ధికి రూ.20 లక్షలు ప్రభుత్వం మంజూరు చేస్తుందని తెలిపారు. ఈ నిధులతో సీసీ రోడ్లు, మురికి కాలువలు, తాగునీటి సౌకర్యం, విద్యుత్‌తో పాటు మౌలిక వసతులు కల్పించుటకు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. ఒక్కొక్క సచివాలయానికి రూ.20 లక్షలతో పాటు ఉపాధిహామీ పథకం కింద మరో రూ.20 లక్షలు అధనంగా అందుతాయని ఎమ్మెల్యే తెలిపారు. ఆయా గ్రామాల్లో చేపట్టాల్సిన పనులకు సంబంధిత అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలతో ఎమ్మెల్యే చర్చించారు. నియోజకవర్గ పరిధిలోని 90 సచివాలయాలకు గానూ 73 సచివాలయాలను రూ.14.60 కోట్ల నిధులతో ఆయా సచివాలయాల పరిధిలోని అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే గంగుల ఈసందర్భంగా వివరించారు.

క్రికెట్ క్రీడా ప్రేమికులకు ఎల్ఈడి స్క్రీన్ ఏర్పాటు

విశాలాంధ్ర- నందికొట్కూరు : నియోజకవర్గ పరిధిలోని పట్టణ,గ్రామీణ ప్రాంత క్రికెట్ క్రీడాభిమానులకు ఉచితంగా పెద్ద ఎల్ఈడి స్క్రీన్ ఏర్పాటు చేయడం జరిగిందని వైసీపీ యువనాయకులు ఎక్కలదేవి చంద్రమౌళి శనివారం విలేకరులకు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నందికొట్కూరులో మాజీ ఎమ్మెల్యే ఐజయ్య ఇంటి ఆవరణంలో ఆదివారం క్రికెట్‌వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ ఇండియా, ఆస్ట్రేలియా ఇరుదేశాలు పోటీ పడే మ్యాచ్ కావున పెద్ద ఎల్ఈడి స్క్రీన్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గంలోని క్రికెట్ అభిమానులు, యువకులు, క్రీడాకారులు, వినియోగించుకోవాలని కోరారు.

ఫిర్యాదులపై రహదారి స్థల పరిశీలన

విశాలాంధ్ర - చాగలమర్రి : కడప జిల్లా ప్రొద్దుటూరు నుంచి చాగలమర్రి హైవేకు అనుసంధానం చేసే నేషనల్ హైవే 440 రహదారిలో భూములు కోల్పోతున్న స్థలాన్ని నంద్యాల ఆర్‌డిఓ శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్ 440 రహదారి నిర్మాణంలో భాగంగా 252/3 సర్వే నెంబర్‌లో 4 రైతులకు సంబంధించిన 59 సెంట్లు భూమిని కోల్పోతున్నారన్నారు. ఈ రహదారి నిర్మాణంలో తమవిలువైన భూములు కోల్పోతున్నామంటూ సంబంధిత రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో పరిశీలించడం జరిగిందన్నారు. ఎన్‌హెచ్ ఉన్నతాధికారులతో కలిసి మరోసారి పరిశీలించి రైతులకు న్యాయం చేస్తామన్నారు. ఎన్‌హెచ్ ఏఈ సురేంద్రారెడ్డి, మండల సర్వేయర్ మద్దిలేటి,విఆర్ఓ వెంకటరామిరెడ్డి,రైతులు పాల్గొన్నారు.

మీ భవిష్యత్తు.. మీ చేతిలోనే

విశాలాంధ్ర- ఉయ్యాలవాడ: 2024 ఎన్నికల్లో ప్రజలు తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకోవాలని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పడిగెపాడులో మండల టీడీపీ నాయకులు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు తాము ఏం చేస్తామో ఇంటింటికి తిరిగి వివరించారు. నాయకులు అనంత రామసుబ్బారెడ్డి, మారంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బోరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, బోరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, అర్జీగారి నరసింహులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : కోరుమానుపల్లి సమీపంలో వెలిసిన శ్రీ గుండం అభయాంజనేయ స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. కార్తీకమాసం మొదటి శనివారం సందర్భంగా స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సమీపంలోని గుండంనీటిలో భక్తులు పవిత్రస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఉమ్మాయిపల్లి గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. వైసీపీ రాష్ట్రసంయుక్త కార్యదర్శి ఓ బాలిరెడ్డి, ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

గాజులదిన్నె ప్రాజెక్ట్‌లో రెండు టీఎంసీల నీటిని నిల్వ చేయబోతున్నాం

కరువు మండలాలుగా ప్రకటించలేదని ఆందోళన వద్దు

రెండో జాబితా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

విశాలాంధ్ర – కర్నూలు జిల్లా పరిషత్తు : గాజులదిన్నె ప్రాజెక్ట్ ఎల్లెల్సీ నుంచి నీరు తీసుకుంటున్నామని, ఈ ప్రాజెక్టులో 2 టిఎంసి నీటిని నిల్వ చేయబోతున్నామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి, జిల్లాఇన్చార్జి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ వెల్లడించారు.శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన గ్రామీణ నీటి సరఫరా -పారిశుద్ధ్యం, వ్యవసాయం, గృహ నిర్మాణ శాఖ అంశాలపై నిర్వహిస్తున్న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసమావేశంలో కర్నూలు, నంద్యాల జిల్లాల కలెక్టర్లు డా.జి. సృజన,డా.మనజీర్ జిలాని సామూన్, నందికొట్కూరు ఎమ్మెల్యే తోగురు ఆర్థర్, నంద్యాల జాయింట్‌కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, కర్నూలు, నంద్యాల జిల్లాల జడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. గ్రామీణ నీటి సరఫరా అంశంపై చర్చ సందర్భంగా కోడుమూరు జడ్పీటీసీ కోడుమూరులో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని ప్రస్తావించిన నేపథ్యంలో మంత్రి మాట్లాడుతూ గాజులదిన్నె రిజర్వాయరుకు నిత్యం 200 క్యూసెక్కుల నీటిని తీసుకుంటున్నామని, ప్రాజెక్టులో 2 టిఎంసి నీటిని నిల్వ చేసి కోడుమూరు తాగునీటి అవసరాలు కూడా తీరుస్తామని మంత్రి పేర్కొన్నారు.జల జీవన్ మిషన్ క్రింద నిధులు పుష్కలంగా ఉన్నాయని, చేపట్టిన పనులకు వెంటనే బిల్లులు మంజూరు అవుతాయని మంత్రి తెలిపారు. ఆసక్తి ఉన్న వారిని,కాంట్రాక్టర్లను టెండర్లలో పాల్గొనేలా స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని మంత్రి సూచించారు. గ్రామాల్లో కాంట్రాక్టర్లు ముందుకు రాని పక్షంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కలెక్టర్లకు సూచించారు. కొన్ని నియమాల ప్రకారం మండలం ఒక యూనిట్ గా ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటిస్తుందన్నారు.వర్షపాత నమోదు, భూమిలో ఉండే తేమ తదితర 4,5 అంశాలను పరిగణన లోకి తీసుకుని కరువు మండలాల ప్రకటన జరుగుతుందన్నారు..కరవు మండలాలుగా ప్రకటించలేదని ఆందోళన చెందవద్దని, రెండు జిల్లాల్లో మిగిలిన మండలాలను రెండోజాబితాలో కరువు మండలాలుగా ప్రకటించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని మంత్రి తెలిపారు. ప్రతిపాదనల మేరకు ప్రభుత్వం వాటిని కరువు మండలాలుగా ప్రకటించే అవకాశం ఉందని మంత్రి వివరించారు.జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో జల జీవన్ మిషన్ పనుల కోసం పిలిచిన టెండర్ల వివరాలను స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కర్నూలు జిల్లా కలెక్టర్ డా.జి.సృజన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 24 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడం జరిగిందని, అదే విధంగా కర్నూలు (రూరల్), తుగ్గలి మండలాలను కూడా కరువు మండలాలుగా ప్రకటించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు.పలువురు జడ్పీటీసీ, ఎంపీపీ లు తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు.ఉమ్మడి జిల్లాలకు చెందిన శాసనసభ్యులు పాల్గొన్నారు.సమావేశం ప్రారంభంలో కల్లూరు జడ్పిటిసి ఆళ్ల ప్రభాకర్ రెడ్డి ఇటీవల అకాల మరణం పొందిన సందర్భంగా జిల్లా అధికారులు, ఎమ్మెల్యేలు, జడ్పిటిసిలు, ఎంపీపీలు, ఇతర ప్రజాప్రతినిధులు రెండు నిమిషాలు మౌనం పాటించి వారి ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు.సమావేశం చివర్లో జిల్లా పరిషత్ లో ఉన్న పురాతన భవనాన్ని వారసత్వ సంపదగా గుర్తించి పర్యాటక శాఖకు లీజుకు ఇవ్వడం కోసం తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి, ఉమ్మడి జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

దీక్ష జయప్రదం చేయండి - సీపీఐ

విశాలాంధ్ర – ఆలూరు : రాష్ట్రంలో కరువు పరిస్థితులను పట్టించుకోని ప్రభుత్వ మొండి వైఖరిని ఖండిస్తూ సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో విజయవాడలో ఈ నెల 20, 21 తేదీల్లో జరుగు 30 గంటల నిరసన దీక్షను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేష్, సీపీఐ మండల కార్యదర్శి రామాంజనేయులు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో సీపీఐ 30 గంటల నిరసన దీక్ష వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణా జలాలు పున పంపిణీ గెజిట్ నోటిఫికేషన్ వ్యతిరేకిస్తున్నామన్నారు. జిల్లాలో కరువు పరిస్థితులు దారుణంగా ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆరోపించారు. బ్యాంకులలో రైతుల తీసుకున్న అన్ని రకాల పంట రుణాలను మాఫీ చేయాలన్నారు. గ్రామాలలో త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తుచర్యలు చేపట్టాలని, వలసలను నివారించి, తక్షణమే కరువు సహాయ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఏఐటీయూసీ తాలూకా అధ్యక్షుడు శివ, వ్యవసాయ కార్మిక సంఘం తాలూకా కార్యదర్శి రంగన్న, సిద్ధలింగ, గోపాల్, బండయ్య, ఓబులేసు, నాగరాజు, భాష తదితరులు పాల్గొన్నారు.

హొళగుంద : మండలంలోని రైతుల సమస్యలపై నిరంతరంగా పోరాడాలని సీపీఐ మండల కార్యదర్శి పెద్దహేట మారెప్ప పిలుపునిచ్చారు. ఆస్పరి మండలం రామతీర్థంలో శనివారం జరిగిన ఏపీ రైతు సంఘం జిల్లా మహాసభలు విజయవంతమయ్యాయని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జగన్నాథం, లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా సభలు జరిగాయన్నారు. జిల్లా ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం కార్యదర్శి జగన్నాథం, లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల ఏపీ రైతు సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారన్నారు. మండల ఏపీ రైతుసంఘం కార్యదర్శిగా ఏసు కృష్ణయ్య, మండల ఏపీ రైతు సంఘం అధ్యక్షుడిగా సాలాంసాబ్,ఉపాధ్యక్షులుగా వెంక న్న, సహకార దర్శులుగా నూరుబాషా ,యూసుఫ్‌ను ఏకగ్రీవంగా ఎన్నికైన్నారు .ఎన్నికైన కార్యవర్గ సభ్యులను అభినందించారు రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ ముందుండాలని విజ్ఞప్తి చేశారు.

జాబితా తయారీలో అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర- పెద్దకడబూరు : ఖరీఫ్ సీజన్ లో 2023కు సంబంధించిన నష్టపరిహారం జాబితా తయారు చేయుటలో రైతు భరోసా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి వరప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి హరేంద్ర అన్నారు. శనివారం మండల కేంద్రమైన పెద్దకడబూరులోని స్థానిక రైతు భరోసా కేంద్రంలో రైతు భరోసా సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు భరోసా సిబ్బంది, వీఆర్వోలు కలిసి పంటలు నష్టపోయిన రైతులకు సంబంధించిన జాబితా తయారు చేస్తారని తెలిపారు.ఈనెల 21 నుంచి 25 వరకు సామాజిక తనిఖీ నిమిత్తం రైతు భరోసా కేంద్రాల వద్ద జాబితాను ప్రదర్శించడం జరుగుతుందన్నారు. రైతులకు సంబంధించిన బ్యాంకు ఖాతా, ఆధార్ వివరాలను సేకరించుటలో గ్రామ వాలంటీర్లు, రైతులు సహకరించాలని కోరారు.కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భారత్ గ్యాస్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర -గోనెగండ్ల: కేంద్ర ప్రభుత్వం పేదలకోసం ప్రతిష్టాత్మకంగ ప్రవేశపెట్టిన ఉజ్వల్ స్కీమ్ ఏజెన్సీ వారికి వరంగాను పేదలకు శాపంగాను మారిందని జనసేన పార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ మీడియా ఇంఛార్జి గానిగ బాషా తెలిపారు, గోనేగండ్ల మండల కేంద్రంలో ఉన్నా శ్రీ దుర్గా భవానీ గ్యాస్ ఏజెన్సీ నందు అర్హులైన పేదలకు పంపిణీ చేసే ఉజ్వల్ స్కీమ్ ద్వారా వంట గ్యాస్ అందాలంటే డాక్యుమెంట్ ఛార్జీలు రూ 200/- అప్లికేషన్ ఫారం నమోదు కోసం అదనంగా రూ 50/- ఇచ్చిన వారి పేరును మాత్రమే నమోదు చేస్తారని లేదంటే అర్హత ఉన్నా వారికి కనెక్షన్ కట్ తప్పదన్నారు, గ్యాస్ కనెక్షన్ అందాలంటే ఏజెన్సీకి చెయ్యి ఎంత ఎక్కువ తడివితే అంత త్వరగా గ్యాస్ అందుతుందని లబ్ధిదారులు వాపోతున్నారు, రూ 500/- కంటే ఎక్కువగానే అక్రమ వసూళ్లకు పాల్పడుతూ ఉజ్వల్ పథకాన్ని తూట్లు పొడుస్తూ అర్హులైన లబ్దదారుల నుండి నిలువు దోపిడి చేస్తున్న గ్యాస్ ఏజెన్సీపై విచారణ జరిపించి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రోడ్లన్నీ గుంతల మయమే...ప్రయాణం సాగేదెలా..!

దేవనకొండ-విశాలాంధ్ర: తెలుగుదేశం పార్టీ ఇంచార్జి కోట్ల సుజాతమ్మ ఆదేశాల మేరకు మండల టీడీపీ కన్వీనర్ విజయ భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో తెలుగుదేశం -జనసేన ఉమ్మడి కార్యాచరణలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని రోడ్ల పరిస్థితిపై నిరసన వ్యక్తం చేసారు సైకో పాలనలో రోడ్లు పూర్తిగా పాడైపోయి ప్రమాదలకు గురై ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని అయిన కూడా ఈముఖ్యమంత్రి స్పందిచడం లేదని విమర్శించారు ఈ కార్యక్రమం లో బడిగించల రంగన్న, ఉచ్చిరప్ప, వీరేష్, మలకన్న, మల్లయ్య,డీలర్ బండ్లయ్య, మాల బండ్లయ్య, మస్తాన్, తెలుగుదేశం యువత నాయకులు రాజా సాహెబ్,ఖాసీం,రాజశేఖర్ గౌడ్, చాందు బాషా,జనసేన నాయకులు మక్బుల్, మహానంది, ఆంటోని, రామలక్ష్మణ్, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు లీగల్ : కల్లూరు మండలం కొంగణపాడు గ్రామ మెయిన్ రోడ్డు, ఛిద్రమైన రోడ్లపై వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేసిన పాణ్యం మాజీ ఎమ్మెల్యే టీడీపీ ఇంచార్జి గౌరు చరిత , జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు చింతా సురేష్ మాట్లాడుతూ చాలాచోట్ల గుంతల రోడ్లు పాడైపోయినయి వారు విమర్శించారు. వైసీపీ ఓన్లీ ప్రచారం తప్పు చేసింది ఏమీ లేదని వారు ఆవేదన వ్యక్తం తెలియజేశారు. పేరుకు మాత్రం గొప్ప చేసింది దిబ్బగా తప్ప ప్రజలకు గాని ప్రజా క్షేమం కానీ వైకాపా పూర్తిగా విఫలం చెందిందని భవిష్యత్తులో వైకాపా ఇంటికి పోయే రోజులు దగ్గర ఉన్నాయని వారన్నారు. రాష్ట్రంలో ఉమ్మడిగా టిడిపి జనసేన కలిసి అధికారంలోకి రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు అవుతారని ప్రజలకు భరోసా ఇచ్చారు మీరు ఏమాత్రం భయపడకుండా ముందుకు వెళ్లాలని ఎలాంటి ఇబ్బందులు కష్టాలు వచ్చినా నాలుగు నెలలు ఓపిక ఉంటే మన ప్రభుత్వం అధికారంలోకి రాబోతోంది మీరు ఏమి భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు మాదేష్, ఉలిందకొండ ఇవి రమణ, కాసాని మహేశ్ గౌడ్, నియోజకర్గ తెలుగు యువత అధ్యక్షుడు జవ్వాజి గంగాధర్ గౌడ్, కొంగణ పాడు గ్రామ నాయకులు గోపాల్ రెడ్డి,మాజీ సర్పంచ్ నాగయ్య,లక్ష్మన్న ,దూపాడు లోకేష్, దొడ్డిపాడు బాషా,బొల్లారం రమణ రెడ్డి,జనసేన పార్టీ నాయకులు మంజునాథ,జగదీష్, భాస్కర్, రాకేష్, వలి, సలాం,తదితరులు పాల్గొన్నారు.

కరువుపై సీపీఐ దీక్ష జయప్రదం చేయండి

విశాలాంధ్ర-దేవనకొండ : కృష్ణా జలాల పున:పంపిణీపై గెజిట్ నోటిఫికేషన్ రద్దు కోరుతూ.. కరువు నివారణ సహాయక చర్యలు.. ఆంధ్రప్రదేశ్ భవిత కోసం..2023 నవంబర్ 20, 21వ తేదీలు విజయవాడలో జరుగు 30 గంటల నిరసన దీక్షలు జయప్రదం చేయాలని దేవనకొండ సిపిఐ కార్యాలయంలో గోడపత్రికలు విడుదల చేస్తున్న సీపీఐ బృందం.శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఎమ్.నరసరావు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసేలా ఉన్న కృష్ణా జలాల పంపిణీ పై గెజిట్ నోటిఫికేషన్ కు వ్యతిరేకంగా, రాష్ట్రంలో కరువు పరిస్థితులను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరిని ఖండిస్తూ ఈనెల 20 21వ తారీకులలో విజయవాడలో నిర్వహించే 30 గంటల నిరసన దీక్షను జయప్రదం చేయాలని తెలిపారు. ప్రభుత్వం కరువు సహాయక చర్యలు చేపట్టే వరకు రాష్ట్రస్థాయిలో ఉద్యమాలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఎన్నికల్లో లబ్ది పొందదానికి మోడీ ప్రభుత్వం కృష్ణాజిల్లాల వివాదాన్ని తెరపైకి తీసుకువచ్చిందని దీని ద్వారా ఏపీకి అన్యాయం చేయాలని చూస్తోందని విమర్శించారు. ఎండిన పంటకు నష్టపరిహారం ఇవ్వాలని, రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు మాఫీ చేయాలని, గ్రామాల్లో 200 రోజులు ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ 30 గంటల నిరసన దీక్షలో రైతులు ప్రజాసంఘాలు సిపిఐ నాయకులు కార్యకర్తలు విరివిరిగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సిపిఐ 30 గంటల దీక్ష వాల్ పోస్టర్ లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు ప్రసాద్, రామాంజనేయులు, సుల్తాన్, రవి, భాష, శ్రీనివాసులు, భాస్కర్, రామంజి తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన ఇద్దరిలో ఒకరి మృతదేహం లభ్యం

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: నగరంలోని కేసీ కెనాల్‌లో గల్లంతైన రామపోగు పవన్ కుమార్,అతిని స్నేహితుడు మాల సాయి చరణ్ శుక్రవారం కేసి కెనాల్ లో గల్లంతు కాగా అందులో రామపోగు పవన్ కుమార్ (15) అనే వ్యక్తి మృతదేహం జోహారాపురం సమీపంలో శనివారం లభ్యమైంది. బుధవారుపేటకు చెందిన రామపోగు పవన్ కుమార్, కర్నూలు ఏ.కాంప్ ఇందిరాగాంధీ మెమోరియల్ మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూలులో 8వ తరగతి చదువుచున్నాడు. అతిని స్నేహితుడు మాల సాయి చరణ్ కలిసి ఈనెల 18న కేసీ కెనాల్‌లో స్నానానికి వెళ్లి కాలుజారి కాలువలో పడ్డారు. శనివారం జోహారాపురం సమీపంలో నీటిపై మృత దేహం తేలుతుండటం గమనించి ఫిర్యాది రామపోగు దానిమ్మ గుర్తు పట్టి పోలీసులకు సమాచారమిచ్చారు. త్రీటౌన్ పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్ప గించారు. కానీ మాల సాయి చరణ్ యొక్క ఆచూకీ లభించాల్సి ఉంది

విద్యార్థులకు బహుమతులు పంపిణీ

విశాలాంధ్ర- పెద్దకడబూరు : మండల పరిధిలోని జాలవాడి ప్రాథమిక పాఠశాలలో 56వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయాధికారిణి ఆశాజ్యోతి ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విక్టోరియమ్మ అధ్యక్షతన నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు శనివారం గ్రామ సర్పంచ్ మల్లమ్మ, ఉప సర్పంచ్ ఉసేని, వైసీపీ నాయకులు ఆంజనేయులు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, సుజాత, శివకుమార్,గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థినీలకు నాణ్యమైన విద్యను అందించాలి

విశాలాంధ్ర – కృష్ణగిరి : కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సర్వ శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన క్రిష్ణగిరిలో కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా విద్యార్థుల తరగతులకు గదులకు వెళ్లి వారి విద్య ప్రామాణికమును అడిగి తెలుసుకున్నారు. అలాగే భోజన గదిశాలకు వెళ్లి మెను ప్రకారంగా పిల్లలకు భోజనం అందిస్తున్నార లేదని తనిఖీ చేశారు. నాడు నేడు పనులలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడాతూ నాణ్యమైన విద్యతోపాటు మెలికలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలని ఆయన తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి వారిని ప్రోత్సహించాలని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ విద్యను వారికి అందిస్తూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నాడు నేడు పనులు త్వరితగతిన పనులు పూర్తి చేయాలని నాణ్యత లోపించకుండగా పనులు చేపట్టాలన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న మెను ప్రకారం పిల్లలకు భోజనం అందించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ డెవలప్మెంట్ అధికారి సునీత, ఐ ఇ కోఆర్డినేటర్ సాయిరాం, కస్తూర్బా ప్రిన్సిపల్ చైతన్య స్రవంతి, సి ఆర్ పి కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి తాకట్టు పెట్టిన మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

మాజీ ఎమ్మెల్యే డా బి వి జయనాగేశ్వర రెడ్డి

విశాలాంధ్ర – ఎమ్మిగనూరు : ప్రజల ఆస్తులను కాపాడటంలో టీడీపీ ఎప్పుడు ముందుంటుందని మాజీ ఎమ్మెల్యే డా. బివి జయనాగేశ్వర రెడ్డి అన్నారు. ప్రజలను పీడించి చెత్తపన్ను వసూలు చేయించే పనిపై ఉన్న శ్రద్ధ ప్రజలకు మంచి చేయడంలో పెట్టండి కమీషనర్ గంగిరెడ్డి అని పేర్కొన్నారు. శనివారం బీవీ విలేఖర్లతో మాట్లాడుతూ ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి కమీషనర్‌గా కాకుండా వైసీపీ కండువా కప్పుకొని కౌన్సిలర్‌గా పోటీ చేస్తే బాగుంటుందన్నారు. ఎమ్మెల్యే చెన్నాకేశవరెడ్డి ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డాడు. ఎమ్మిగనూరులో ఎన్నడూలేని భూవివాదాలు ఇప్పుడు ఎందుకు వస్తున్నాయి అని సూటిగా ప్రశ్నించారు. గతంలో చేనేత కుల బాంధవుడు పద్మశ్రీ మాచాని సోమప్ప కులమతాలకు అతీతంగా దూరదృష్టితో పెద్దలు, పిల్లలు అందరికి ఆహ్లాదం కొరకు సుమారు 6.06 ఎకరాల్లో వైడబ్ల్యూసీఎస్ గ్రౌండ్ కేటాయిస్తే ఆస్థలంలో షెడ్లు ఏర్పాటు చేయడం సిగ్గు చేటని, దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించి దీనిపై స్టే తీసుకొని వచ్చామని, రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం కూడా తమ న్యాయమైన అభ్యర్థనను విని 3 నెలల్లోగా గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన షెడ్లను తొలగించాలని పేరొన్నదని తెలిపారు. హాస్యాస్పదం ఏంటంటే ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డిని దీనిపై వివరణ కోరి షెడ్లను తొలగించాలి అని అడిగితే జాప్యం చేసి నేడు మిలిటరీ కాలనిలో సుమారు 40 ఏళ్లుగా నివాసం ఉంటున్న స్థిర గృహాలను రోడ్ వైండనింగ్ పేరుతో జేసిబిలతో కూల్చడానికి వెళ్లారని అంటే మున్సిపల్ కమీషనర్ గంగి రెడ్డికి పెదలంటే, పేదల ఆస్తులంటే అంతా చులకనా, కోపం ఎందుకు అని పేర్కొన్నారు.

ఎమ్మిగనూరు మున్సిపల్ కమీషనర్ గంగి రెడ్డి తమ అధికారాన్ని వైసీపీ నాయకులకు తాకట్టు పెట్టి తాను ఒక మున్సిపల్ కమిషనర్ అనే విషయాన్ని మరిచారని, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డిని కమీషనర్‌గా కాకుండా వైసీపీ కౌన్సిలర్‌గా పోటీ చేస్తే బాగుంటుందని బీవీ హితవు పలికారు.

జిల్లాలో కరువు సహాయక చర్యలు చేపట్టాలి

అట్టహాసంగా తాలూకా మహాసభలు

విశాలాంధ్ర – ఆస్పరి : జిల్లాలో తీవ్రవర్షాభావ దృష్ట్యా ప్రభుత్వం తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీరెడ్డి, జగన్నాథం లు డిమాండ్ చేశారు. శనివారం ఆస్పరికి సమీపంలోనే రామతీర్థం క్షేత్రంలో ఏపీ రైతుసంఘం 10వ తాలూకా మహా సభలను అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా మహాసభ పథకాన్ని ఏపీ రైతుసంఘం తాలూకా అధ్యక్షులు నాగేంద్రయ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు.అనంతరం ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పాలకులు చిన్న చూపుతో వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకినెట్టివేశారన్నారు. రైతన్నను ఆదుకోవడం కోసం స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలన్నారు. ఆలూరు నియోజకవర్గం సస్యశ్యామలానికై వేదావతి ప్రాజెక్టును 8 టీఎంసిల సామర్థ్యంతో తక్షణమే పూర్తి చేసి ప్రాజెక్టు పరిధిలోనే అన్ని గ్రామాలకు సాగు త్రాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పంట పెట్టుబడుల కోసం రైతులు చేసిన అప్పులను కరువు సహాయక చర్యల కింద మాఫీ చేయాలని, రైతులకు ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు. అక్టోబరు 31న హడావుడిగా కరువు మండలాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, అయితే సహాయ చర్యలు మాత్రం చేపట్టలేదన్నారు. వేరుశనగ, కంది తదితర పంటలకు ఎకరానికి రూ.50వేలు, మిరప పంటకు ఎకరాకు రూ. లక్ష నష్టపరిహారమివ్వాలని, ఉపాధి హామీ పథకం కింద 200 రోజులు పనిదినాలు కల్పిస్తూ రోజుకు రూ.600 చొప్పు కూలీ చెల్లించాలని కోరారు. ఏపీ రైతు సంఘం తాలూకా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.తాలూకా అధ్యక్షులుగా హెూతూరప్ప, కార్యదర్శిగా నాగేంద్రయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆస్పరి మండల నూతన కమిటీని సైతం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఆంజినయ్య, అధ్యక్షులుగా బడేసాబ్, ఉపాధ్యక్షులుగా ఆంజనేయ, గోపాల్, లక్ష్మన్న ప్రధాన కార్యదర్శిగా రంగన్న, సహాయ కార్యదర్శిగా రగులయ్య, హనుమంతు, రామ్మోహన్ కోశాధికారిగా ఉరుకుందప్పలతో పాటు 21 మంది మండల కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆస్పరి, ఆలూరు, హెూలగుంద మండలాల సీపీఐ కార్యదర్శులు విరుపాక్షి, రామాంజినేయులు, మారెప్ప, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, సీపీఐ జిల్లా సమితి సభ్యులు భూపేష్, కృష్ణమూర్తి, ఆలూరు రైతు సంఘం నాయకులు జగదీష్, శంకర్, వన్నూరు, రాజశేఖర్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ డబ్బాలు పెట్టుకుంటారా అయితే హొళగుందకు రండి

విశాలాంధ్ర- హొళగుంద : హొళగుంద బస్టాండ్ అక్రమ కట్టడాలు వల్ల ఇరుకుగా ఉండడంతో గతంలో గ్రామ కార్యదర్శిగా పనిచేసిన ఇసాక్ ప్రత్యేక చొరవ చూపి అక్రమ కట్టడాలను తొలగించి విశాలమైన బస్టాండ్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు .అప్పటి రాష్ట్ర ఎత్తిపోతల శాఖ మంత్రి మూలింటి మారెప్ప సహకారంతో సిసి రోడ్డును నిర్మించారు. గ్రామ సర్పంచ్ చెలువాది రంగమ్మ మరియు పాలకవర్గ సభ్యులు అధికారుల సహకారంతో అక్రమ కట్టడాలను వెనుకకు నట్టేసి సీసీ రోడ్డు నిర్మించిన ప్రయోజనం లేకుండా పోయిందని ప్రజలు ఆరోపించారు. బస్టాండ్ లో ఉపాధి పొందుతున్న పూల అంగళ్ల పండ వ్యాపారస్తులు దుకాణాలు టీ కొట్టులు ఇతర అంగండ్ల యజమానులు అక్రమంగా అంగన్లు డబ్బాలు పెట్టుకొని బస్టాండ్ స్థలాన్ని ఆక్రమించుకోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దుకాణాల యజమానులు దుకాణాల సామాన్లు ముందు వరుసలో పెట్టడం వల్ల ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. వినియోగదారులు సరుకులు కొనడానికి అధికసంఖ్యలో హొళగుందకు వస్తుంటారు .సరుకులు కొనుగోలు చేసే ద్విచక్ర వాహనాలు బస్టాండ్లో అక్రమంగా పార్కింగ్ చేయడంతో ప్రజల వాహనాలకు సర్వీసులకు విద్యార్థులకు మహిళలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. బస్టాండ్ ను విశాలంగా చేసినప్పటికీ అక్రమంగా డబ్బాలు పెట్టుకోవడంతో సర్వీసు బస్సులు మలుపులు తిప్పుకోవాలంటే నానా అవస్థలు పడి బస్సులను డ్రైవర్లు తిట్టుకుంటూ తిప్పుకుంటున్నారు .అక్రమంగా డబ్బాలు పెట్టుకోవడంతో బస్టాండ్ ఇరుకుగా మారి ట్రాఫిక్ సమస్య ఏర్పడిందని ప్రజలు వాపోతున్నారు.యదేచ్ఛగా అక్రమ డబ్బాలు కొనసాగించడం పట్ల అక్రమ డబ్బాలు పెట్టుకుంటారా అయితే హొలగుంద బస్టాండ్ కు రండి అనే చందంగా మారిందని ప్రజలు వాపోయారు.గ్రామ కార్యదర్శి రాజశేఖర్ గౌడ్ ను విచారించగా అక్రమ డబ్బాల విషయం తెలిసిందని చర్యలు తీసుకుంటానని అన్నారు .బస్టాండ్ అభివృద్ధికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు .బస్టాండులో ట్రాఫిక్ సమస్య ఉన్నది వాస్తవమేనని అన్నారు .పోలీసుల సహకారంతో అక్రమ డబ్బాలు తొలగించడానికి పాలకవర్గంతో కలిసి చర్యలు తీసుకుంటామని అన్నారు.

బోరు రిపేరు చేయించాలి

విశాలాంధ్ర – ఆత్మకూరు రూరల్ : ఆత్మకూరు మండలం వెంకటాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాదాపు 500 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వము విద్యార్థులకు మధ్యాహ్నా భోజన పథకాన్ని ఏర్పాటు చేసింది .భోజన సమయంలో పవర్ సప్లై లేకుంటే మంచినీటి కొరతతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా కాలినడకన శ్రీశైలం పోయే భక్తులకు ఈబోరు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఈ బోరు గత సంవత్సర కాలం నుంచి పనిచేయటం లేదు రిపేరులో ఉంది.కావున అధికారులు స్పందించి ఈ బోరు ను రిపేరు చేయించాలని కోరారు.

టీడీపీ నుంచి వైసీపీలోకి చేరిక

విశాలాంధ్ర- వెల్దుర్తి : మండల పరిధిలోని గోవర్ధన గిరి గ్రామం నుంచి 12 కుటుంబాలు పత్తికొండలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆధ్వర్యంలో టిడిపి నుంచి వైసీపీలోకి చేరారు. సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి తోనే అభివృద్ధి సాధ్యమని ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని. మరోసారి సీఎం చేసి గెలిపించుకుందామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో రవి, పురుషోత్తం, మహేష్, రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, ఆదివారం 19, నవంబర్ 2023

రోడ్లపై నాటేసి నిరసన తెలిపిన టీడీపీ జనసేన

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: తెలుగుదేశం- జనసేన పార్టీల ఉమ్మడి సారధ్యంలో గుంతల ఆంధ్రప్రదేశ్ కు దారేది కార్యక్రమాన్ని కర్నూల్లో ఇరు పార్టీల నేతలు నిర్వహించారు. శనివారం నగరంలోని 18వ వార్డు పరిధిలోని జొహరాపురం నుండి ఇందిరమ్మ కాలనీకి వెళ్లే ప్రాంతంలో గుంతల రోడ్డు వద్ద నీటిలో నాట్లు నిరసన తెలిపారు. ఏపీ గుంతల రాష్ట్రంగా మారిపోయిందని నినాదాలు చేశారు. ఈ ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఏ ఊరుకు వెళ్లినా గుంతల దారులే కనిపిస్తాయని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రంలో అభివృద్ధి ఉంటుందన్నారు. టిడిపి, జనసేన ప్రభుత్వంలో ప్రజలకు మంచి పరిపాలన అందుతుందని తెలిపారు. ఇక కర్నూల్లో టి.జి భరత్ ను ఎమ్మెల్యేగా గెలిపించుకుంటేనే ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, జనసేన కర్నూలు బాధ్యులు హర్షద్, పవన్ కుమార్, అనిత శ్రీ, ఐ.టి విభాగం ఛైర్మన్ లక్ష్మీకాంతరెడ్డి, లీగల్ సెల్ ఛైర్మన్ శ్రీనివాసులు, కార్పోరేటర్ పరమేష్, వార్డు ఇంచార్జీలు గున్నామార్క్, మోహన్, గణేశ్, మహిళా నాయకురాలు చిట్టెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి పూర్వ వైభవం తీసుకొస్తాం

ఆలూరు టిడిపి మాజీ ఇంచార్జ్ వైకుంఠం మల్లికార్జున చౌదరి

విశాలాంధ్ర - చిప్పగిరి: ఆలూరు నియోజకవర్గం లో తెలుగు దేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకొని వస్తామని ఆలూరు టిడిపి మాజీ ఇంచార్జ్ వైకుంఠం మల్లికార్జున చౌదరి అన్నారు. శనివారం మండల కేంద్రమైన చిప్పగిరి లోనే వైకుంఠ దంపతులైన కీర్తిశేషులు వైకుంఠం శ్రీరాములు, శకుంతలమ్మ ల 18వ వర్ధంతి సందర్భంగా వారి సమాధులకు వైకుంఠం మల్లికార్జున చౌదరి, సునీతమ్మలు పూల మాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఆలూరు టిడిపి మాజీ ఇంచార్జ్ వైకుంఠ మల్లికార్జున చౌదరి పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి కంచుకోట లాంటిదని పార్టీకి పూర్వ వైభవం తీసుకుని వచ్చి త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఆలూరులో తెలుగుదేశం పార్టీ విజయ దంక మోగించడం జరుగుతుందని జోష్యం చెప్పారు. తెలుగుదేశం ప్రభుత్వంతోనే బడుగు బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమని, రాష్ట్రంలోని నిరుపేదల కొరకు ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకొని వచ్చిన ఘనత టిడిపికే దక్కుతుందన్నారు. కనుక 2024 సంవత్సరంలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఒక సైనికుడిలా పార్టీ కోసం ముందుండి పోరాడాలన్నారు. కార్యక్రమంలో మండల మాజీ మండల అధ్యక్షుడు భీమలింగప్ప చౌదరి, మండల కన్వీనర్ షేక్షావలి, పెద్దన్న , రామాంజనేయులు, నాగరాజు, రాము, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర - చిప్పగిరి: జాతీయ కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాబురావు అన్నారు. శనివారం అనంతపురం జిల్లా గుంటకల్ నియోజకవర్గ పరిధిలోని కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నెట్టికంటి ఆంజనేయ స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలు గ్రామీణ ప్రాంతాలలో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కనుక రాష్ట్ర ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సుఖ సంతోషాలతో ఉండే విధంగా దీవించాలని స్వామి వారిని కోరుకున్నామన్నారు. నెట్టికంటి ఆంజనేయస్వామి దర్శించుకున్న వారిలో ఆలూరు అసెంబ్లీ కోఆర్డినేటర్ కమిటీ సభ్యులు చిప్పగిరి లక్ష్మీనారాయణ తో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాలి గాలి మల్లికార్జున, కేఎల్ స్వామిదాస్, చిప్పగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేగల హాల్ మంజునాథ్, చిప్పగిరి మండల ఎంఆర్పిఎస్ అధ్యక్షులు కాజీపురం రాంబాబు, కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు చిప్పగిరి వినోద్ కుమార్, రంగా, అమరేష్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కరించడంలో పాలకులు విఫలం

విశాలాంధ్ర - ఆదోని రూరల్ : పట్టణ ,మండల ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో విఫలం చెందాయని కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్,కాంగ్రెస్ కోఆర్డినేషన్ మెంబర్ దిలీప్ దోక విమర్శించారు. శనివారం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్చార్జి నీలకంఠప్ప అధ్యక్షతన మండల స్థాయి సమావేశం జరిగింది.ఈ సందర్భంగ దిలీప్ దోక మాట్లాడుతూ మండలంలో దాదాపు వ్యవసాయంపై ఆధారపడే కుటుంబాలు వలస బాట పట్టి ఉంటే పాలకులు నింపుకుని వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు. గ్రామాల్లో కరువు విలయతాండవిస్తున్న పూర్తిస్థాయిలో విచారణ చేసి పరిహారం అందించాల్సిన పాలకులు మొద్దు నిద్ర పోతున్నారని ఆగ్రహ వ్యక్తం చేశారు. పేద ప్రజల ఇండ్ల పంపిణీ పట్టణ ప్రజల ఇంటి పట్టాల అధికారులకు పంపిణీ చేయడంపై అవకతవకలు నెలకొన్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. గతంలో నెరవేర్చుకునేందుకు ఇంటి పట్టా కోసం 2100 చెల్లించిన డిడి తమ వద్ద ఉన్న ఇంతవరకు మంజూరు చేయకపోవడం,పేదోడి సొంతింటి కల నెరవేర్చడంలో మొద్దు నిద్రపోతున్నారన్నారు. రెవెన్యూ కార్యాలయాలు చుట్టు చెప్పులు అరిగిపోయేలా ప్రదక్షిణలు చేస్తున్న సమస్యల పరిష్కరించకపోవడం దారుణమని అసహన వ్యక్తం చేశారు. చిట్ కోఫ్లీలకు విద్యుత్ చార్జీలు చెల్లిస్తున్న ఇంతవరకు సొంత ఇంటిలోకి చేరుకోలేని పరిస్థితి ప్రస్తుత పాలనలో నెలకొందన్నారు. ఇకమీదట ప్రజా సమస్యల పరిష్కరించలేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి రావు,పట్టణ కార్యదర్శి సాయినాథ్, యువజన అధ్యక్షుడు దేవి శెట్టి వీరేష్,జయరాం,మద్దిలేటి, మాణిక్యరాజు,నిసారహ్మద్, రామంజి,నాగేష్,మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభల దృశ్యమాలిక

డ్రైనేజీపై బంకులు తొలగవు.. మురుగు తొలగదు

విశాలాంధ్ర- వెలుగోడు : పేరుకే మేజర్ గ్రామ పంచాయతీ .. కానీ ఎక్కడ చూసినా పంచాయతీ స్థలాల్లో అక్రమంగా వేసుకున్న బంకులే రాజకీయ నాయకుల అండదండలతో బంకులు వేసుకోవడం వల్ల ప్రభుత్వ అధికారులకు బంకులపై ప్రజలు పిర్యాదు చేసినా పట్టించుకోకుండా చోద్యం చూడాల్సిందే. గతంలో గ్రంథాలయ శాఖ ముందు బంకులు తొలిగించాలని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.ఆఖరుకు కలెక్టరు కు పిర్యాదు చేసిన ఇతర కారణాలతో తొలిగించ లేదు. ఇటీవల గాంధీనగర్ టర్నింగ్ వద్ద ఉన్న బంకుల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అధికారులకు, ఎమ్మెల్యేకు ప్రజలు ఫిర్యాదు చేసినా పట్టించు కోలేదు. ఆఖరుకు స్పందనలో జిల్లా కలెక్టరు కు మూడు బంకులను తొలిగించాలని ఫిర్యాదు ఇవ్వగా, కేవలం ఒక బంకుకు నోటీసు ఇచ్చి సరిపుచ్చగా, విశాలాంధ్ర పత్రికలో బంకుల తొలిగింపుపై ఆలస్యం అంటూ ప్రచురితంకాగా, జిల్లా అధికారుల దృష్టికి వెళ్లడంతో బంకు యజమానిపై ఒత్తిడి తెచ్చారు.బంకు యజమాని అక్కడున్న బంకును తొలిగించి విద్యుత్ కార్యాలయం ముందు ఉన్న డ్రైనేజీపై బంకు వేశారు. అక్కడున్న బంకు ను తొలిగించి , ఇక్కడ వేయడం తొలిగింపు ఎలా అవుతుంది అని ప్రజలు చర్చించుకుంటున్నారు. అదికూడా ఒక బంకు నే తొలిగించడపై, మిగతా రెండు బంకుల మాటేమిటి అని ఫిర్యాదు చేసిన గాంధీనగర్ ప్రజలు విమర్శించారు. ఫిర్యాదు చేసిన వ్యక్తి తో గాంధీనగర్ లో నిర్మాణం లో ఉన్న రూమ్ ను అపుతామనే బెదిరింపు చేసి సంతకం తీసుకున్నారనే విమర్శలు వస్తున్నాయి. అయినా ప్రజలు మళ్ళీ జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేస్తామని అన్నారు. గ్రంథాలయం, విద్యుత్ కార్యాలయాల ముందు ఉన్న బంకులు తొలిగించాలని పలువురు జిల్లా కలెక్టరును కోరుతున్నారు. ఈ బంకుల సమస్య ఎప్పటికి తొలిగేనా అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

విశాలాంధ్ర-ఆత్మకూరు టౌన్ : అంగన్వాడీలకు రిటర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని సీఐటీయు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, ఏపీ అంగన్వాడి వర్కర్స్అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి మంజుల, కోశాధికారి లక్ష్మిదేవిలు అన్నారు. శనివారం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం దగ్గర రిలే నిరాహార దీక్షను చేపట్టారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీలకు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. హెల్పర్ల ప్రమోషన్లకు వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచాలన్నారు. ప్రమోషన్ లో రాజకీయ జోక్యం అరికట్టాలి, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలన్నారు. వైయస్సార్ సంపూర్ణ పోషణ మెను చార్జీలు పెంచాలన్నారు. గ్యాసును ప్రభుత్వమే సరపరా చేయాలన్నారు. 2017 నుండి పెండింగ్ లో ఉన్న టిఏ బిల్లులు ఇవ్వాలన్నారు. లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని పంపిణీ చేయాలన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర-వెల్దుర్తి: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెలుగుదేశంపార్టీ పత్తికొండ ఇన్చార్జి కేఈ శ్యాంబాబు శనివారం బాబు ష్యూరిటీ.భవిష్యత్తుకు గ్యారంటీ. మాదాపురం, గుంటుపల్లె, మంగంపల్లె, ప ర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకొని కరపత్రాలను పంపిణీ చేశారు.ఈసందర్భంగా కేఈ శాంబాబు మాట్లాడుతూ చంద్రబాబు మహిళాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బలరాంగౌడ్, సీనియర్ నాయకులు శంకర్ రెడ్డి,బొమ్మిరెడ్డిపల్లె సుబ్బారాయుడు, మాజీ మండల అధ్యక్షుడు జయరాముడు, మంగంపల్లి శ్రీనివాసులు. తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

విశాలాంధ్ర-చాగలమర్రి : స్థానిక మల్లెవేముల బస్టాండు సమీపంలోని శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు గ్రంథాలయ అధికారి రామచంద్ర ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.అందులో భాగంగా శనివారం భారతి మందిరం పాఠశాలలో సుమారు 50 మంది విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలను నిర్వహించారు.ఈ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని గ్రంథాలయ అధికారి తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది లాలయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

20న జగనన్నకు చెబుదాం

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఈనెల 20న సోమవారం కర్నూలు కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - కోవెలకుంట్ల: మండల కేంద్రమైన కోవెలకుంట్లలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా పి. రాఘవ రెడ్డి గ్రంథాలయ అధికారి ఆధ్వర్యంలో కోవెలకుంట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు గ్రంథాలయం ప్రచారంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. గ్రంథాలయ ప్రాముఖ్యత గురించి పుస్తక పఠనంతో ఉపయోగాలు గురించి గ్రంథాలయ అధికారులు వరించారు. వారోత్సవాల కరపత్రాలు కూడా విద్యార్థులు ప్రదర్శించారు.కార్యక్రమంలో హెచ్ఎంవి. రాజయ్య, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ప్రభుత్వం ఉన్నత పాఠశాల సిబ్బందికి విద్యార్థులకు గ్రంథాలయ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

చెన్నకేశవ స్వామికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-అవుకు : మండలంలోని ఉప్పలపాడులో వెలిసిన శ్రీ చెన్నకేశవ స్వామికి వైసీపీ సీనియర్ నాయకుడు చల్లా సూర్య ప్రకాష్ రెడ్డి, వైసిపి ముఖ్య నాయకులు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డిలు ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఉప్పలపాడు గ్రామానికి విచ్చేసిన చల్లా విగ్నేశ్వర్ రెడ్డికి గ్రామస్తులు మేళతాళాలతో భారీ ఊరేగింపుగా స్వాగతం పలికారు. గ్రామంలో పురాతన ఆలయమైన శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో చల్లా విగ్నేశ్వర్ రెడ్డి సొంత నిధులు వెచ్చించి రంగులు మరియు కరెంటు వైరింగ్ పనులను చేయించి ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా చల్లా విగ్నేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి స్వర్గీయ శాసన మండల సభ్యులు చల్లా రామకృష్ణారెడ్డి పుట్టిన గ్రామం కావున కొండమీది గ్రామాలు అంటే చల్లా కుటుంబానికి సొంత ఇంటి లాంటివని కొండమీద గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా చల్లా కుటుంబీకులు పనిచేస్తారని అన్నారు. కొండమీది గ్రామాల అభివృద్ధి కోసం చల్లా కుటుంబం ఎల్లప్పుడు ముందు ఉంటుందని అన్నారు.

ఉత్సయ్య నిర్మాణానికి ఎమ్మెల్యే లక్ష విరాళం

విశాలాంధ్ర- పెద్దకడబూరు : మండల పరిధిలోని పీకలబెట్టలో వెలసిన శ్రీ ఆంజనేయస్వామి ఉత్సయ్య నిర్మాణానికి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులు సీతారామరెడ్డి, వైసీపీ రాష్ట్ర యువనాయకులు ప్రదీప్ రెడ్డి తరపున శనివారం గ్రామ వైసీపీ నాయకులు మూకిరెడ్డి ఆలయ పెద్దలకు లక్ష రూపాయల నగదును అందజేశారు. ఇందులో మాజీ సర్పంచ్ మూలింటి ఈరన్న, తోవి ఈరన్న, హనుమంతు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గుడ్ షఫర్డ్ సంస్థ విద్యార్థుల పట్ల ఔదార్యం

విశాలాంధ్ర -రుద్రవరం: మండల పరిధిలోని ఆయా పాఠశాలలలో విద్యను అభ్యసిస్తున్న పేద విద్యార్థిని విద్యార్థులకు గుడ్ షెఫర్డ్ సంస్థ ఔదార్యంతో దుస్తులను అందజేశామని మండల కేంద్రంలోని స్పెషల్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్ తెలిపారు . శనివారం ఆయన మాట్లాడుతూ గత 15 సంవత్సరంల నుండి పేద విద్యార్థులకు ప్రతి సంవత్సరం నవంబర్ 14 వతేదీన గుడ్ షెఫర్డ్ సంస్థ ఆధ్వర్యంలో దుస్తులను కలెక్ట్ చేసి పంపించడం జరుగుతుందన్నారు. ఈసంవత్సరం కూడా వారి ఔదార్యంతో దాదాపు 7 వేల జతల దుస్తులను మండల పరిధిలోని 20 పాఠశాలలకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా గుడ్షెఫర్డ్స్కూల్ ప్రిన్సిపల్ జెస్సి పాల్కి,సహృదయముతో సహకరించిన ప్రతి విద్యార్థికి ఉపాధ్యాయ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

బాబుతోనే రాష్ట్రాభివృద్ధి

విశాలాంధ్ర- పెద్దకడబూరు : రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్ రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని హనుమాపురం, దొడ్డిమేకల గ్రామాల్లో నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ తిక్కారెడ్డి ఆదేశాల మేరకు నాయకులు నరవ రమాకాంతరెడ్డి, బాబురావు ఆధ్వర్యంలో శనివారం తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్ రెడ్డి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటింటికి తిరుగుతూ చంద్రబాబు అమలు చేసే సంక్షేమ పథకాల గురించి వివరించారు. టీడీపీ అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి టిడిపి నేతలపై కేసులు నమోదు చేసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు స్వామి, ఈరన్న, రాజశేఖర్, రంగన్న, సోమన్న, లక్ష్మికాంతరెడ్డి, ప్రతాప్ రెడ్డి, నరసింహారెడ్డి, అయ్యప్ప, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర- బనగానపల్లె: బనగానపల్లె శాఖ గ్రంథాలయ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రియదర్శిని పాఠశాల నందు "స్వాతంత్ర సమరంలో సమాజంపై గ్రంథాలయాల పాత్ర"అనే అంశంపై వ్యాసరచన పోటీలు, ప్రకృతి అందాలు అనే అంశంపై చిత్రలేఖన పోటీలు గ్రంథాలయాధికారి జలాల్ బషీర్ అహ్మద్ ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో విజయం సాధించిన వారికి 20వ తేది శాఖ గ్రంథాలయంలో బహుతుల ప్రధానం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన.. వక్తృత్వ పోటీలు

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ : పట్టణంలోని వైపిపిఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 56వ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ఆళ్లగడ్డ గ్రంథాలయాధికారిణి అరుణకుమారి ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అంబేద్కర్ గురుకుల పాఠశాల, మహాత్మారావు జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల, వైపిపిఎం ఉన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ ఈ పోటీలు సృజనాత్మకతను పెంపొదిస్తాయన్నారు. విద్యార్థులు ప్రతి పోటీలను సద్వినియోగం చేసుకుని ప్రతిభను చాటుకోవాలన్నారు.. వ్యాసరచన పోటీల ద్వారా విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయవచ్చువన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వీరరాఘవయ్య, ఉపాధ్యాయులు వెంకటరమణ, ఖాజా, గాయత్రీ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.